క్లుప్తంగా

నేడు వైఎస్సార్ జయంతి

మార్కాపురం టౌన్: డివిజన్ కేంద్రం మార్కాపురం పట్టణంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ గడియార స్తంభం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేయనున్నారు. తూర్పువీధిలోని జువ్విచెట్టు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద అన్నదానం చేయనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్, జగనన్న అభిమానులు హాజరు కావాలని అన్నా రాంబాబు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ బి.శేషగిరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముండ్లపాడు, కె.ఎస్.పల్లె, బురుజుపల్లె, కంచిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిల్లో విద్యుత్ తీగల పై ఉన్న చెట్టు కొమ్మల నరికివేతల కారణంగా ఆయా సబ్ స్టేషన్ పరిధిలోని తాళ్లపల్లె, దిగువమెట్ట, కె.బయనపల్లె, నల్లగట్ల, బ్రాహ్మణపల్లె, చంద్రారెడ్డిపల్లె, కొంగలవీడు, ఎన్.బయనపల్లె గ్రామాలతో పాటుగా పట్టణంలోని పి.ఆర్.కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొంగలవీడురోడ్డు, శ్రీరామ్ నగర్, ఏబీఎం పాలెం, విశ్వభారతి స్కూల్ రోడ్డు, అర్బన్ కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

కొమరోలులో కూడా..

కొమరోలు: మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తాటిచెర్లమోటు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామన్నారు. తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లె, హసనాపురం, ముత్రాసుపల్లె, దద్దవాడ, గుంద్రెడ్డిపల్లె, నారాయణపల్లె, అలసందలపల్లె, గోవిందపల్లె, పొట్టిపల్లె, అక్కపల్లె, వెంకటాంపల్లె, కంకరవానిపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశిరెడ్డినాయన కుంట ఆవరణలోని శ్రీరామకృష్ణ ధ్యానమందిరంలో ఈ నెల 10వ తేదీ గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, ధ్యానం, గాయత్రి యజ్ఞం వంటి భక్తి కార్యక్రమాలతో పాటుగా గురువు ప్రాముఖ్యత పై పలువురి ప్రసంగాలు ఉంటాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

గురుపౌర్ణమి సందర్భంగా పూజలు

బేస్తవారిపేట: స్థానిక త్రిలోక పుణ్యక్షేత్రంలో ఈనెల 10వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి గిరీష్‌రెడ్డి తెలిపారు. పంచామృత అభిషేకాలు, అలంకరణ, పల్లకిసేవ, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. యర్రబాలెంకు చెందిన కోలాట బృందంతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


ముగిసిన ఆలయ వార్షికోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు సందర్భంగా శ్రీవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా ముందుగా అకిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన శ్రీవారి కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాలతో గోవింద నామ స్మరణతో వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాతకోట శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఉభయదాతలు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించగా ఆలయ అర్చకులు విజయ్‌కాంత్‌శర్మ కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి గోవిందా గోవిందా.. అంటూ పరవశించిపోయారు.

మార్కాపురంపై వైఎస్సార్‌ది చెరగని ముద్ర


దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్

మార్కాపురం టౌన్: 2004కు పూర్వం మార్కాపురం పట్టణంలో తీవ్ర తాగునీటి సమస్య ఉండేది. సంవత్సరంలో 8 నెలల పాటు ప్రజలు నీటి కోసం కష్టాలు పడేవారు. 1995 నుంచి 2004 వరకు చంద్రబాబు పాలన అంతా కష్టాలమయమే. అటు వర్షాలు లేక ఇటు భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లు పనిచేయక అధికారులు చేతులెత్తేయడంతో బిందె నీటిని రెండు రోజుల పాటు వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంధువులకు సైతం తమ ఇళ్లకు రావద్దని అప్పట్లో మార్కాపురం ప్రజలు చెప్పారు. అటువంటి గడ్డు పరిస్థితిని శాశ్వతంగా తొలగించేందుకు వైఎస్సార్ కృషి చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో అధికారంలోకి రాగానే రాజీవ్ పల్లెబాటలో భాగంగా మార్కాపురం పట్టణానికి వచ్చి శాశ్వతంగా తాగునీటి ఎద్దడి నివారించే పథకానికి శంకుస్థాపన చేయడంతో మార్కాపురం వాసులకు సాగర్ (కృష్ణా) నీటిని తాగే అవకాశం దక్కింది. 2004 ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి నేతృత్వంలో 2004 అక్టోబర్ 27న స్థానిక గాంధీ పార్కులో 32 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన పథకానికి సంబంధించిన పైలాన్‌ను వైఎస్సార్ ఆవిష్కరించారు. పథకం పూర్తయ్యే నాటికి రూ.52 కోట్లకు చేరింది. అప్పటి వరకు పట్టణ వాసులకు ఫ్లోరైడ్ నీరే దిక్కుగా ఉండేది. గుండ్లకమ్మ నీటి ఆధారంగా పైపు లైన్లతో ప్రజలకు నీటిని అందించేవారు. ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేసే వారు. రోజు ఇంటికి 5, 6 బిందెలు మాత్రమే వచ్చేవి. ప్రజల కష్టాలను మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాగార్జున సాగర్ కుడి కాలువ నీటిని ఉపయోగించుకుని దూపాడు వద్ద ఎస్ఎస్ ట్యాంక్ నిర్మించి అక్కడ కృష్ణా నీటిని నిల్వ చేసి పైపు లైన్ల ద్వారా మార్కాపురం పట్టణానికి సరఫరా చేయాలని ఆదేశించారు. ఇందు కోసం 20 కిలోమీటర్ల పొడవున దూపాడు నుంచి మార్కాపురానికి పైపు లైన్ల ద్వారా పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని వెంకటేశ్వర మున్సిపల్ పాఠశాలలో, బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ ట్యాంక్ ద్వారా 2,200 ఎంఎల్ నీటిని నిల్వ ఉంచి పట్టణ ప్రజలకు అందించాలని నిర్ణయించారు. ఆయన ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన పథకం ద్వారా పట్టణంలో సాగర్ నీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రస్తుతం నాలుగు రోజులకు ఒకసారి సాగర్ నీరు ప్రజలు తాగుతున్నారంటే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఘనతేనని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం గుండ్లకమ్మలో ఉన్న సంప్‌లో నీరు నిల్వ ఉన్నంత వరకే పట్టణ ప్రజలకు మున్సిపల్ నీరు అందేవి. గుండ్లకమ్మ ఎండిపోతే డీప్ బోర్లు వేసి పంపింగ్ చేసి ట్యాంకర్ల ద్వారా మున్సిపల్ అధికారులు వార్డుల్లోని ప్రజలకు అందించే వారు. ప్రస్తుతం సంవత్సరంలో 8 నెలల పాటు సాగర్ నీటిని ప్రజలు తాగుతున్నారు. దీంతో మార్కాపురం పట్టణానికి వైఎస్సార్ అమలు చేసిన పథకం వరంగా మారటంతో పాటు ఆయన్ను ప్రజలు గుర్తుంచుకునే విధంగా మారింది.


దూపాడు వద్ద సాగర్ నీరు నిల్వ చేసే ఎస్ఎస్ ట్యాంక్


గాంధీ పార్కులో వైఎస్సార్ ఆవిష్కరించిన పైలాన్

తర్లుపాడు: మండలంలోని అన్నీ పంచాయతీల్లో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించాలని మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పెయింటింగ్ వేసి ప్రత్యేకంగా అలంకరించాలన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి

● మాజీ ఎమ్మెల్యే అన్నా పిలుపు

మార్కాపురం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఆ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ ట్రేడ్ యూనియన్ జాయింట్ సెక్రటరీగా నియమితులైన పట్టణ మాజీ అధ్యక్షుడు బట్టగిరి తిరుపతిరెడ్డి సోమవారం అన్నా రాంబాబు నివాసానికి వచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్రస్థాయి పదవి ఇచ్చినందుకు శక్తివంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మాజీ జెడ్పీటీసీ రంగారెడ్డి, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఇరువురిని సన్మానించారు.


అన్నా రాంబాబు, బట్టగిరిని సన్మానిస్తున్న కార్యకర్తలు

అడుగుకో గుంత.. ప్రాణానికి చింత


మోకాలి లోతు గుంతలు ఉన్న తాటిచెర్ల రహదారి


గుంతల్లో నిండి ఉన్న వర్షం నీరు


తారు లేచిపోవడంతో మెటల్ రహదారిగా దర్శనమిస్తున్న తాటిచెర్ల రోడ్డు

● తాటిచెర్ల రహదారి అడుగడుగునా గుంతల మయం

కొమరోలు: మండలంలోని తాటిచెర్లమోటు నుంచి తాటిచెర్ల గ్రామానికి వెళ్లాలంటే అడుగడుగునా గుంతలమయంగా ఉండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అమరావతి - అనంతపురం జాతీయ రహదారిపై నుంచి తాటిచెర్ల గ్రామానికి ఓ కాలిబాట ఉంది. దాదాపు 20 ఏళ్ల క్రితం తారురోడ్డును అప్పటి ప్రభుత్వం వేసింది. కానీ ప్రస్తుతం జాతీయ రహదారి నుంచి తాటిచెర్ల గ్రామానికి ఒక కిలోమీటరు బాటలో అడుగడుగునా మోకాలిలోతు గోతులు ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే నరకయాతన అనుభవిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వర్షంపడితే మరింత యాతన తప్పదని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారి నుంచి తాటిచెర్ల గ్రామానికి నూతనంగా రహదారిని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


అడుగడుగునా గోతులమయంగా మారిన తాటిచెర్ల రహదారి

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కంభం: చదువుకోవాల్సిన వయస్సులో విద్యార్థులు చెడువ్యసనాల జోలికి వెళ్లకూడదని స్థానిక సీఐ కె.మల్లిఖార్జున సూచించారు. స్థానిక వాసవీ జూనియర్ కళాశాలలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థునులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు సైబర్ క్రైమ్‌ల పై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, ఇతర సమాచారం అడిగితే చెప్పకూడదన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, వాసవీ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోళ్ళ సుబ్బరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు సూచనలిస్తున్న సీఐ

సిగ్గు లేకుండా గొప్పలు చెప్పకుంటున్నారు..

● మాజీ ఎమ్మెల్యే అన్నా

తర్లుపాడు: సూపర్-6 అంటూ బూటకపు హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ఏదో చేసినట్లు సిగ్గు లేకుండా కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు విమర్శించారు. ఆదివారం రాత్రి తుమ్మలచెరువులో పెద్ద షరిగత్ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా నాటి సీఎం వైఎస్ జగనన్న నెరవేర్చారన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేశారో.. ఎవరు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్నారో.. ప్రజలందరూ గమనించాలన్నారు. మీకు మేలు చేసిన జగనన్నను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాబోయే రోజుల్లో ఆశీర్వదించాలని కార్యకర్తలను కోరారు. ఖాశింస్వామి ఆశీస్సులతో అందరి కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, మన ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఖాశింస్వామి దర్గాలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నాను ఘనంగా సన్మానించారు. ముందుగా సర్పంచ్ షాజహాన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు షరీఫ్, నాయకులు అబ్దుల్ ఆధ్వర్యంలో అన్నాకు స్వాగతం పలికారు. ఎంపీపీ రామసుబ్బారెడ్డి, పార్టీ అధ్యక్షుడు మురారి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు రామిరెడ్డి, వెంకటరెడ్డి, ఎబినేజర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.


అన్నాను సన్మానిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

పొదిలి: దేశవ్యాప్తంగా బుధవారం జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కోరారు. సమ్మె సన్నాహకాల్లో భాగంగా సోమవారం పట్టణంలో జరిగిన మోటారు సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన సవరణ జరగాలన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ కోసం సమగ్ర చట్టం రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ స్కీమ్‌ల్లో పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే చర్యలు మోదీ ప్రభుత్వం నిలుపుదల చేయాలన్నారు. మోటార్ బైక్ ర్యాలీ పెద్ద బస్టాండ్, ప్రధాన రహదారి, పోలీసుస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కాలేజీ రోడ్డు, ఆర్‌డబ్ల్యూఎస్ ఆఫీస్, వెటర్నరీ హాస్పిటల్, ఎంపీడీఓ కార్యాలయం వరకు సాగింది. సీఐటీయూ మండల కార్యదర్శి బి.కోటేశ్వరరావు, నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, కేవీ నరసింహం, జి.నాగేశ్వరరావు, యోహాన్, రామయ్య పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న రమేష్

కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

పొదిలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ జన్మదినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం స్థానిక ఏబీఎం పాఠశాల వద్ద జరిగాయి. ముందుగా బాబా సాహెబ్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షల సందేశాలు పంపించారు. కార్యక్రమంలో ముక్కెర కిరణ్, వేల్పుల సురేష్, బూదాల బెంజిమెన్, తంగిరాల ఆఫీరస్, కరాటపు ఐజాక్, ఆదిమూలపు రవి, వేల్పుల నెహెమియా, గురిజాల శాంత, గుంటగాని ఎలీషా, పందిటి ఏసేబు, కొమ్ము శ్యాంసన్, మల్లెల శ్యాం, గంగవరపు నాగులు, గురిజాల చక్రవర్తి, రావినూతల నాగరాజు, గజ్జా బాబు, వేల్పుల చైతన్య పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సంక్షిప్తంగా

సబ్సిడీపై పశువుల దాణా సరఫరా

పొదిలి రూరల్: ప్రభుత్వం పశుపోషకులకు అందజేస్తున్న పశువుల దాణాను 50 శాతం సబ్సిడీపై సరఫరా చేయనున్నట్లు ఉన్న గురవాయుపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మయ్య తెలిపారు. ప్రస్తుతం 88 బస్తాల పశుదాణా అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. గతంలో 130 బస్తాలు రూరల్ పరిధిలో గ్రామాల పశుపోషకులు సరఫరా చేయగా ఈ సారీ పొదిలి నగర పంచాయతీ పరిధిలోని రాజుపాలెం, కొత్తపాలెం, బుచ్చనపాలం, కాటూరివారి పాలెం గ్రామాల పశుపోషకులకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మెడికల్ కాలేజీని త్వరగా ప్రారంభించాలి

మార్కాపురం టౌన్: మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ కరీంబాషా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మెడికల్ కాలేజీని ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే గతేడాది 5, ఈ ఏడాది 7 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రారంభమై వైద్య విద్య అందుబాటులోకి వచ్చి ఉండేదన్నారు. సుమారు 5 వేల మెడికల్ సీట్లు అందుబాటులో ఉండేవన్నారు. విదేశీ వైద్య విద్యార్థులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

ముజావర్ మృతి

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో సోమవారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముజావర్ మదర్‌షావలి (58) గుండెపోటుతో మృతి చెందారు. దీంతో గ్రామోత్సవం అర్ధాంతరంగా నిలిచిపోయింది. పలువురు నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

21న ఐటీఐ విద్యార్థులకు కౌన్సెలింగ్

మార్కాపురం: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 21న జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపల్ బి.వాసుబాబు తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే వారు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 95533 06631 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


కొమరోలు : పీర్లను గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా మొహర్రం

కొమరోలు: మండలంలో మొహర్రం పండుగను 3 రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. కొమరోలులోని పెద్దపీర్ల చావిడి, చిన్న పీర్ల చావిడి వద్ద చివరి రోజు సోమవారం ఘనంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్లను గుండాల చుట్టూ తిప్పి అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

గిద్దలూరు రూరల్: మండలంలోని త్రిపురాపురం గ్రామంలో సోమవారం మొహర్రం పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కడప లక్ష్మీ, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి దంపతులు పీర్లచావిడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పీర్లచావిడిల్లో పీర్లను గ్రామంలో ఊరేగింపుగా తరలించారు. పట్టణంలోని ఖాదర్‌వలి స్వామి దర్గా పీర్ల చావిడి వద్ద మొహర్రం పండుగను భక్తులు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా పెద్ద సరిగెత్తు

మార్కాపురం టౌన్: పవిత్ర మొహర్రం పండుగను పురస్కరించుకుని పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని పట్టణంలో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇస్లాం, ధర్మ పరిరక్షణ కోసం అశువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ముస్లింలు ఉపవాస దీక్ష చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు, దువా నిర్వహించారు. పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధి, కొండారెడ్డి కాలనీ, విజయటాకీస్ తదితర పీర్ల చావిడిలో పీర్లను తీసి గుండంలో నడుచుకుంటు వెళ్లారు. పీర్లకు దట్టీలు, పూలతో అలంకరించిన గుమ్మటాలు తొడిగి వివిధ వెండి గొడుగులు, ఊయలలు, కర్ణాభరణాలు, నాగాభరణాలు అలంకరించారు. భక్తులు పీర్లకు వారు పోసి బొరుగులు, పప్పులు, బెల్లం సమర్పించారు. ముజావర్లు పీర్లను ఎత్తుకుని భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. భక్తులు గుండంలో కొబ్బరి కాల్చారు. చాందిరిలో పీర్లను ఉంచి పట్టణ పురవీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. ముజావర్లు, మతపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ దంపతులు


పగలు ఉత్సవంలో గొర్లగడ్డ పీర్లు

ఒంగోలు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం: ఒంగోలులో సోమవారం జరిగిన 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ఎమ్మార్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి షాలెంరాజు ఆధ్వర్యంలో స్థానిక కందులాపురం కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో ఒంగోలు బయలుదేరి వెళ్లారు.


కంభం నుంచి తరలి వెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

అర్ధవీడు: మండల పరిధిలోని కాకర్ల గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ జెండాను మండల అధ్యక్షుడు దనురాజు మాదిగ ఆవిష్కరించారు. దనురాజు మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 31 సంవత్సరాలు అయిందని తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జు చల్లగాలి విజయకుమారు, జిల్లా బాధ్యులు పి.విల్సను, సంఘ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఒంగోలులో జరిగే 31వ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవానికి సోమవారం భారిగా తరలివెళ్లారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బొడిచర్ల రాజు తెలిపారు. కార్యక్రమంలో పానుగంటి షాలెంరాజు, బీ రాజు, బ్రహ్మయ్య, పీ సుబ్బారావు, గోన మోహన్‌రావు, సునీల్, జయరాజు తదితరులు పాల్గన్నారు.